క్లుప్తంగా

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



కొత్తకోట రూరల్: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి 82వ జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక చౌరస్తాలో జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీని ఒప్పించడంలో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే బాబు, బోయేజ్, గొల్లబాబు, బీచుపల్లియాదవ్, మిషేక్, నరేందర్‌రెడ్డి, ధన్వాడ బాలస్వామి, సాయిలుయాదవ్, నరేందర్‌సాగర్, వెంకటేష్, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌గౌడ్, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు



ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గిరిపై కేసు నమోదు చేశారు. అలాగే వాహనదారుల హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, తాగి డ్రైవింగ్ చేయరాదని వహనదారులకు సూచించారు.

సేవాలాల్ ఉత్సవ కమిటీ ఎంపిక

ఖిల్లాఘనపురం: మండల సేవాలాల్ ఉత్సవ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు రవినాయక్ తెలిపారు. ఖిల్లాఘనపురంలో పలు తండాలకు చెందిన గిరిజనుల సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా ముడావత్ రవినాయక్, ప్రధాన కార్యదర్శిగా కాట్రావత్ రాథోడ్, కోశాధికారి కాట్రావత్ హన్మంతునాయక్, ప్రధాన సలహాదారులుగా సభావత్ రాంసింగ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా మండలంలోని గుమ్మడం, శ్రీరంగాపురం మండలంలోని నాగరాల, తాటిపాములలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అందరూ లబ్ధి పొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపైన, వైద్య ఆరోగ్యశాఖ తరపున క్షయ, అసంక్రమిత వ్యాధులపైన అవగాహన కల్పించారు. పథకాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

క్రీడాకారుడికి సన్మానం



కొత్తకోట రూరల్: రగ్బీ అసోసియేషన్ వనపర్తి జిల్లా కార్యదర్శిగా ఇటీవల నియమితులు అయిన పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హఫీజ్‌ను బీఆర్‌ఎస్ నాయకుడు రవిచందర్‌రావు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రగ్బీకి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పీపీఎల్-3లో క్రికెట్ పోటీలో భాగంగా మొదటి బహుమతి రూ.10వేల నగదును రవిచందర్‌రావు, రెండో బహుమతి రూ.5వేల నగదును మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, డీలర్ లక్ష్మణ్‌గౌడ్ సంయుక్తంగా అందించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు యాదగిరిగౌడ్, డిప్యూటీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, మన్నె ప్రకాశ్‌రెడ్డి, సందడి బుచ్చిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆసీఫ్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మద్యం సీసాలు

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గదిలో మద్యం తాగి సీసాలు, ఇస్తరాకులు గదిలో ఉంచి వెళ్లారు. సీసలు పగుల గొట్టడంతో వరండా నిండా గాజు పెంకులు ఉన్నాయని గ్రామస్తులు మండిపడ్డారు. పాఠశాలలో మద్యం తాగిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.



ఘనంగా సంక్రాంతి సంబరాలు

- అలరించిన ముగ్గులు, పతంగులు
- గంగిరెద్దుల విన్యాసాలు

ఆత్మకూర్: మకర సంక్రాంతి సంబరాలను మూడు రోజుల పాటు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా ఇంటి ముంగిట్లో రంగరంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లల్లో నువ్వుల రొట్టెలు, పిండి వంటల ఘుమఘుమలు, గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భార్గవినగర్‌లో చైర్‌పర్సన్ గాయత్రి ఆధ్వర్యంలో ముగ్గులు వేసి సందడి చేశారు. పండుగ సందర్భంగా మంగళవారం ఆత్మకూర్ పట్టణ రహదారులు, బస్టాండ్ ప్రయాణికులు లేక బోసిపోయాయి.

అమరచింత: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆడపడుచులు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులతో వాకిళ్లను అందంగా అలంకరించారు. గ్రామాల్లో యువకులు క్రీడాపోటీలను నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్ ఆటలతో యువకులు ఆనందంగా గడిపగా.. యువతులు రంగురంగుల గాలిపటాలను ఎగురవేసి సరదాగా జరుపుకొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు మండలంలో ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు.



పాన్‌గల్ మండలం అన్నారంలో ఎద్దుల బండ్ల ఊరేగింపు

ఈ సందర్భంగా గ్రామాల్లో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు. దీంతో పాటు మండలంలోని బుసిరెడ్డిపల్లిలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొల్లిగట్టు ఉత్సవాల సందర్భంగా గుట్టపై వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. పూజల్లో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవిత తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలో మంగళవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. దుప్పల్లి, మదనాపురం, అజ్జకొల్లు, గోపన్‌పేట, కొత్తపల్లి, కొన్నూరు, నర్సింగాపురం, నెలివిడి, తదితర గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.



ఖిల్లాఘనపురంలో..



బుసిరెడ్డిపల్లిలో బొల్లిగట్టుపై ..



ఆత్మకూర్‌లో..

చదువుతో పేదరిక నిర్మూలన

కొత్తకోట రూరల్: రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా చదువుతోనే పేదరిక నిర్మూలన అనే అంశాన్ని ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి.ప్రశాంత్, బోయేజ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఐదో తరగతి గురుకుల పాఠశాల ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌లోని 16మంది విద్యార్థులకు జేఎస్‌ఆర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్‌ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని, గురుకుల పాఠశాలలో సీట్లు సాధించాలని సూచించారు. సెలవు దినాల్లో పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండేవిధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజు, కో ఆప్షన్ సభ్యుడు మిషేక్, అమృతరాజ్, అయ్యన్న, సుభాష్, భాస్కర్, కుర్షకుమార్, నవీన్, క్రాంతి, కళ్యాణ్, రాజు, సతీష్, డేవిడ్, కిరణ్, శిక్షకులు అనిల్‌కుమార్, అనిల్, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నాయకులు

విభజన హామీలు అమలు చేయాలి

వనపర్తి టౌన్: రాష్ట్ర విభజన హామీల అమలులో కేంద్ర ప్రభుత్వ వివక్షపై చర్చించేందుకు ఏర్పాటు చేసే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్‌పాషా పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా తేల్చాలని, ఉద్యోగ విభజనను పూర్తి చేసి తెలంగాణ ఉద్యోగులను వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర స్థాయి సంస్థల ఆస్తులు తెలంగాణకు విభజించాలని, రాష్ట్రంలో హార్టీకల్చర్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తక్షణమే ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు పిక్కిలి బాలయ్య, పట్టణ అధ్యక్షుడు రఘు నాయుడు, ప్రధాన కార్యదర్శి శాంతారం నాయక్, నక్క వెంకటస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఘనంగా మడివాళ్ల మాచయ్య జయంతి

అమరచింత: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో రజకుల కుల దైవమైన మడివాళ్ల మాచయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని పల్లకీలో పట్టణ పురవీధు గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మాచయ్య ఆలయంలో ఘనంగా పూజలు చేశారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలను అందించారు. ఈమేరకు రజక సంఘం జిల్లా అధ్యక్షుడు బండలయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతి పర్వదినం రోజున తమ ఆరాధ్య దైవమైన మడివాళ్ళ మాచయ్య జయంతిని క్రమం తప్పకుండా నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సుతారి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సవరన్న, కోరిశ్రీనివాసులు, తాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాచయ్య పల్లకీ సేవలో రజకులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన చాకలి మన్యం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి తనయుడు ఆదిత్యారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దహన ఖర్చులకు రూ.5వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చీర్ల జనార్దన్, చీర్ల రాములు, చీర్ల ఆంజనేయులు, అయ్యన్న, మన్నెంకొండ, రాంజీ నాయక్, గుంటి మహేష్, శివ సాగర్, గుంటి రాజు, రవి, శివ, అనిల్, తిరుమలేష్, రాజు తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో అనారోగ్యంతో మృతిచెందిన చాకలి లింగయ్య కుటుంబానికి హర్షన్న యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు రంగాపురం శివారెడ్డి మంగళవారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



బండపల్లిలో పరామర్శిస్తున్న అరుణ్

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన నాగేశ్వర్ కుటుంబాన్ని మంత్రి జూపల్లి తనయుడు జూపల్లి అరుణ్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో సంక్రాంతి పండుగ సందర్భంగా జూపల్లి యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్ మహిళా టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు మంగళవారం నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు బహుమతులను అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు పాల్గొనగా వాటిలో ప్రథమ బహుమతి బీహెచ్‌ఎల్‌ఈఎల్ టీంకు రూ.20 వేలు నగదు, షీల్డ్, ద్వితీయ బహుమతి హకీంపేట్ టీం రూ.15 వేలు నగదు, షీల్డు, తృతీయ బహుమతి నల్గొండ టీంకు రూ.10 వేలు నగదు షీల్డు, నాల్గువ బహుమతి బాలానగర్ టీంకు రూ.5 వేలు నగదు, షీల్డులను అందజేశారు. బహుమతులను దాత ఉపాధ్యాయులు చిన్న నర్సింహ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రవికుమార్ అందజేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలో మండలంలోని రోడ్డుమీది తండా జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 18 జట్లు పాల్గొనగా.. ఫైనల్ మ్యాచ్‌లో ఖిల్లాఘనపురం, రోడ్డుమీదితండా జట్లు పోటీ పడగా మొదట బ్యాటింగ్ చేసిన ఖిల్లాఘనపురం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసినట్లు వారు చెప్పారు. అనంతరం బ్యాటింగ్ చేసిన రోడ్డుమీదింతడా జట్లు 11.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 93 రన్నులు చేసి విజేతగా నిలిచిందన్నారు. విన్నర్ జట్టుకు రూ.20 వేల నగదుతో పాటు ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ.10వేల నగదుతో పాటుగా ట్రోఫీని అందజేసినట్లు నిర్వాహకులు హర్యనాయక్, దేవిజానాయక్, మన్యనాయక్, గోపాల్‌నాయక్, గోవిందునాయక్ తెలిపారు.

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను మంగళవారం పురుషోత్తం ప్రారంభించారు. కబడ్డీ, రన్నింగ్, కప్ప గంతులు, పాటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో మొగిలి, సీఐటియూ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, రిటైర్డ్ టీచర్ బాలకృష్ణ, విష్ణు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్లలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, ముగ్గులు, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలను నిర్వహించారు. మంగళవారం రాత్రి కబడ్డీ ప్రాగణంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబర్చిన క్రీడాకారులకు నగదు, బహుమతులను అందజేశారు.



మూలమళ్లలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు



అజ్జకొల్లులో..



ఖిల్లాఘనపురంలో..



కేతేపల్లిలో..

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

పాన్‌గల్: అయోధ్యలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర (ట్రస్టు)ఆధ్వర్యంలో పూజించిన అక్షింతలను సోమవారం మండలంలోని అన్నారం, అన్నారం తండా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా ఇంటింటికీ పంచిపెట్టారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను తీర్థ క్షేత్ర కరపత్రం ప్రతి హిందువుల ఇంటికి చేరుస్తామని ఆయా గ్రామాల నాయకులు పేర్కొన్నారు. 2024 జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సందర్భంగా ఇళ్లలో పూజలు నిర్వహించేందుకు అక్షింతలు అందజేస్తున్నట్లు నాయకులు తెలిపారు. రామమందిరం ప్రారంభం రోజున అక్షింతలను తలపై వేసుకున్న ప్రతి ఒక్కరూ పునీతులు అవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాములు, రంగానాయక్, ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మహేష్‌నాయుడు, వహీద్, శ్రీనివాసులు, కురుమూర్తి తదతరులు పాల్గొన్నారు.



అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

భీమా కాల్వలో జమ్ము, మట్టి తొలగించాలి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల గుండా ప్రవహిస్తున్న భీమా కాల్వలో పేరుకపోయిన జమ్ము, పూడిక మట్టి తొలగించి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి సమీపంలోని భీమా కాల్వను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా, వీపనగండ్ల మండలం కొర్లకుంట, బొల్లారం తదితర గ్రామాల్లోని భీమా కాల్వలో జమ్ము, పూడిక పేరుకపోయిందన్నారు. దీంతో చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదని, దీంతో పాటు కాల్వల్లో పూడికతీత, మరమ్మతు చేపట్టకపోతే వర్షాకాలం నాటికి తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలన్నారు. లేకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పరందాములు, రాముడు, మల్లయ్య, నర్సింహ, చిన్నయ్య పాల్గొన్నారు.



భీమా కాల్వను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

హన్మంత్‌రావుకి నివాళి



ఆత్మకూర్: కురుమూర్తి దేవస్థానం మాజీ చైర్మన్, తిప్పుడంపల్లి మాజీ సర్పంచ్ హన్మంత్‌రావు మృతిపై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తుల సీరాజ్, పరమేష్, శ్రీను తదితరులు సంతాపం తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హన్మంత్‌రావు చికిత్స పొందుతూ మృతి చెందారు. సోమవారం ఎమ్మెల్యే హన్మంతరావు అంత్యక్రియల్లో పాల్గొని ఎంపీటీసీ సభ్యురాలు, హన్మంత్‌రావు సతీమణి సుచిత్రను, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పెబ్బేరు రూరల్: బైక్‌పై వస్తూ డివైడర్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయిన ఘటన జాతీయ రహదారి44 పై కొత్తకోట బైపాస్ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన అభినవ్, రేవంత్‌గౌడ్, వరుణ్ పెబ్బేరు వైపు నుంచి బైక్‌పై కొత్తకోట వెళ్తుండగా బైపాస్ వద్ద బైక్‌ను డివైడర్‌కు ఢీకొట్టడంతో కిందపడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను అంబులెన్సులో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో వరుణ్ పరిస్థితి విషమంగా ఉండంతో హైదారాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయంపై ఏఎస్‌ఐ జయరాములును అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రూ.3లక్షల వితరణ

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి సమీపంలోని గుట్టల్లో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆధునీకరణ పనుల కోసం రూ.మూడు లక్షలు ఖర్చు చేసి పలు పనులను అదే గ్రామానికి చెందిన కట్టా కృష్ణవర్ధన్‌రెడ్డి పూర్తి చేశారు. గ్రామ సమీపంలోని ఆలయానికి అవసరమైన పనుల నిమిత్తం తన సొంత డబ్బులను ఖర్చు చేసి వసతులు కల్పించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని దాత కృష్ణవర్ధన్‌రెడ్డి తెలిపారు. పండగ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో గ్రామ మత్స్యసహకార సంఘం వారు భక్తులకు అన్నదానం చేశారు.

నేడు ఉచిత కంటివైద్య శిబిరం

ఆత్మకూర్: కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్, ఎన్సీఓ దేవేంద్రం, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరంలో కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి కావాల్సిసిన మందులను ఇవ్వడంతో పాటు ఆపరేషన్లు అవసరమయ్యే వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించి చికిత్స అందిస్తారన్నారు. ఆత్మకూర్, అమరచింత, నర్వ, చిన్న చింతకుంట, మదనాపురం మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

వీపనగండ్ల: క్రీడల్లో పాల్గొనే యువకులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినప్పుడే ఉత్తమంగా రాణించగలుగుతారని సర్పంచ్ నర్సింహారెడ్డి, మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పలువురు దాతల సహకారంతో వాలీబాల్ పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్ బస్వరాజ్‌గౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోతుల వెంకట్‌రెడ్డి, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రాప్ హాలీ డే పేరుతో నీటిని తరలించే కుట్ర

అమరచింత: దిగువ ఆయకట్టు రైతులకు సాగు నీటిని విడుదల చేయాలని ఇవ్వాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించడం ఎంత వరకు సమంజసమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జూరాల ఆయకట్టు రైతుల బాధలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు యాసంగిలో సాగు నీరు ఇవ్వలేమని ఆయకట్టుకు క్రాప్ హాలీడే ప్రకటించిన ప్రభుత్వం.. ప్రస్తుతం దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు అవసరం అంటూ నీటిని తరలించుకుని పోవాలన్న డ్రామాలు ఇకపై ఎగువ ఆయకట్టు రైతులు సాగనివ్వరన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి నిరంజన్ రెడ్డి జూరాల నుంచి నీటిని అక్రమంగా తరలించుకుని వెళ్తున్న సందర్భంలో మక్తల్ నియోజక బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా నీటి తరలింపు మాత్రం ఆగట్లేదన్నారు. మక్తల్ నియోజకవర్గంలోనే కృష్ణానది అధికంగా ప్రవహిస్తున్నా ఈప్రాంత ప్రజలకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూర్ జిల్లాకు తాగునీటిని అందిస్తున్న రామన్‌పాడ్ ప్రాజెక్టు నుంచి భీమా ఫేజ్-1, ఫేజ్-2లకు నీటిని తరలించుకుని వెళ్తున్నారని ఆరోపించారు. జూరాల ఆయకట్టు దిగువ ప్రాంతాలైన వనపర్తి, వీపనగండ్ల, కొల్లాపూర్‌లకు సాగునీటిని యాసంగి సాగు కోసమే తరలించుకుని వెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇకనైనా మంత్రి జూపల్లి తన నిర్ణయాన్ని మార్చుకోవాలని లేని పక్షంలో రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ కార్యదర్శి దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, వాటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేర్వ రాజు

విజేతలకు బహుమతుల అందజేత



రాయినిపేటలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కవిత

కొత్తకోట రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని రాయిణిపేటలో స్థానిక ఎంపీటీసీ రాధ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి దేవరకద్ర ఎమ్మెల్యే సతీమణి కవిత బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని విశ్వనాథ వెంకటరమణ, సురేందర్‌రెడ్డి, పూజారి వేణు, మహిళలు తదితరులు ఉన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

వీపనగండ్ల: సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు, చిన్నారులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, బాలబాలికలకు తాడాట, కుర్చీలాట, చెంచా గోటి వంటి ఆటలు ఆడించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, సీపీఎం మండల పార్టీ నాయకులు మురళీ, ఆశన్న, ఈశ్వర్, మధు, సీఐటీయూ నాయకులు రామన్‌గౌడ్, రాంబాబుగౌడ్ బహుమతులను అందజేశారు.



వీపనగండ్లలో..